ప్రజాశక్తి

గురువారం 11 సెప్టెంబర్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

ప్రబలిన అతిసార

- విజయవాడలో 50 మందికి అస్వస్థత ● ఒకరు మృతి
- జిజిహెచ్, అర్బన్ హెల్త్ సెంటర్లలో చికిత్స
- బాధితులను పరామర్శించిన కలెక్టర్ లక్ష్మీశ
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సిపిఎం నేతల వినతి
- నందిగామలో విష జ్వరంతో మహిళ మృతి

ప్రజాశక్తి - విజయవాడ, విజయవాడ అర్బన్ : అతిసార, విష జ్వారాలతో ఎన్‌టిఆర్ జిల్లాలో ఇద్దరు మహిళలు మరణించారు. విజయవాడలో అతిసార ప్రబలి ఒకరు మరణించగా, సుమారు 50 మంది వరకు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. స్థానికుల



అతిసారతో మరణించిన శ్రీరామ నాగమణి మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పిస్తున్న సిపిఎం నేతలు రమణరావు, సత్యబాబు తదితరులు

కథనం ప్రకారం.... విరోచనాలు, వాంతులతో బాధపడుతున్న విజయవాడ 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటకు చెందిన శ్రీరామ నాగమణి (61) అనే మహిళ మంగళవారం ఉదయం ప్రభుత్వాస్పత్రిలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మరణించింది. అలాగే అతిసార బారిన పడిన సుమారు 50 మంది వరకు విజయవాడ ప్రభుత్వాస్పత్రి, వివిధ అర్బన్ హెల్త్ సెంటర్లు, కేర్ అండ్ షేర్ పాఠశాల వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు. గత నాలుగు (మిగతా 2లో)

అతిసారతో మహిళ చనిపోలేదు : కలెక్టర్

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బుధవారం రాత్రి పరామర్శించారు. వారికి అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మొత్తం 22 మంది చికిత్స పొందుతుండగా, ఇప్పటికే ఇద్దరిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.



తాగునీరు, ఆహార నమూనాలను పరీక్షలకు పంపామని తెలిపారు. ముందు జాగ్రత్తగా న్యూ రాజరాజేశ్వరి పేటలో కుళాయి నీటి సరఫరాను ఆపేసి ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రిలో మహిళ మృతికి, అతిసార ఘటనకూ ఎటువంటి సంబంధం లేదన్నారు



జ్వరంతో మరణించిన సముద్రాల మహి



చల్లపల్లి మండలం లక్ష్మీపురం పిఎసిఎస్ వద్ద యూరియా కోసం అవస్థలు పడుతున్న రైతులు

ఇంకా యూరియా కష్టాలే...

చల్లపల్లి మండలంలో సగం మందికే పంపిణీ

ప్రజాశక్తి - చల్లపల్లి : కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం లక్ష్మీపురం, మేకవారిపాలెం పిఎసిఎస్‌ల వద్ద యూరియా కోసం రైతులు అవస్థలు పడ్డారు. యూరియా పంపిణీ చేస్తారని సమాచారం అందుకున్న రైతులు, కౌలు రైతులు సుమారు 500 మంది వరకు బుధవారం ఉదయాన్నే ఆయా సొసైటీల వద్దకు వచ్చారు. యూరియా కోసం పడిగాపులు కాశారు. ఎకరానికి అరకట్ట యూరియా ఇస్తామని అధికారులు ప్రకటించటంతో నిరాశ చెందిన రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. సొసైటీ వద్ద ఆందోళన చేశారు. గతంలో ఇచ్చిన రైతులకు ఇవ్వబోమని, ప్రస్తుతం చిన్న సన్నకారు రైతులకు పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఒకటి రెండు రోజుల్లో యూరియా లోడు వస్తుందని, (మిగతా 2లో)

నేడు 'వర్తమాన పరిస్థితులు - సిపిఎం వైఖరి'పై సదస్సు

- హాజరుకానున్న బి.వి.రాఘవులు

విజయవాడ : సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం సాయంత్రం 6.30 గంటలకు "వర్తమాన పరిస్థితులు - సిపిఎం వైఖరి" అన్న అంశంపై సదస్సు జరుగుతుంది. విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం (చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియం)లో జరిగే ఈ సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి మాట్లాడతారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు అధ్యక్షత వహిస్తారు.

ఉద్యోగాల పేరుతో యువతకు

టెక్ కంపెనీలు వల!

- శిక్షణ పేరుతో ఎంపికైన వారి నుండే లక్షలు వసూలు
- ఆ తర్వాత చిరుద్యోగాలతో సరి ● ఎవరికి వారు మానివేసేలా ఎత్తుగడలు



ప్రజాశక్తి - గన్నవరం : "మంచి తరుణం మించిన దొరకదు... అతిపెద్ద ఐటి కంపెనీలు.. ఏసీలో ఫ్యాన్ కింద రాయల్టీ కంప్యూటర్ ఉద్యోగం..ఆకర్షణీయమైన జీతం.. మీరు ఇంటర్ పూర్తి చేస్తే చాలు.. ఈ అవకాశం కొద్ది రోజులే..మీకు ఉద్యోగం కావాలా నాయనా.. వెంటనే గన్నవరం మండలం కేసరపల్లిలోని హెచ్‌సిఎల్ కంపెనీ వద్దకు వచ్చేయండి.." ఇదీ హెచ్‌సిఎల్ టెక్ బీ పేరుతో ఓ కంపెనీ కొన్నేళ్లుగా సాగిస్తున్న వ్యవహారం. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యువతీ యువకుల ఫోన్ నెంబర్లు తీసుకుని.. వారికి ఆ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాల వల విసురుతున్నారు. ఐటీ కంపెనీలో ఉద్యోగాల పేరిట తెలుగు రాష్ట్రాల్లో యువతీ యువకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆ కంపెనీ విసురుతున్న వలలో వేలాది మంది యువతీ యువకులు చిక్కుకుంటున్నారు. రెండు రోజుల నుంచి కంపెనీ వద్దకు వందల సంఖ్యలో యువతీ యువకులు వచ్చి క్యూలో నిలబడడం కనిపిస్తోంది. ఉద్యోగం వచ్చేది కొద్దిమందికే. అయితే ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థే కంపెనీకే ముందుగా లక్షల్లో సొమ్ము కట్టాలి సుమా !

దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే... హెచ్‌సిఎల్ టెక్‌బి పేరుతో కొన్నేళ్లుగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉద్యోగం పేరుతో సొమ్ము చేసుకుంటున్నారని వాదన ఉంది. విద్యా విద్యార్థుల ఫోన్ నెంబర్లు సేకరించి వారికి కంపెనీ నుంచి మెసేజ్ పెడుతున్నారు. పలానా డేట్‌లో మీరు హెచ్‌సిఎల్ కంపెనీకి వస్తే ఇంటర్వ్యూ చేసి ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్నారు. అది నిజమనుకుని వందల సంఖ్యలో యువతీ యువకులు అక్కడికి వస్తున్నారు. ఏడాదిలో రెండుసార్లు ఈ విధంగా ఇంటర్వ్యూల పేరుతో (మిగతా 2లో)



నాటక రంగానికి మంచిరోజులు

'సత్య హరిశ్చంద్ర' ప్రదర్శనలో వర్ల రామయ్య

విజయవాడ : రాష్ట్రంలో నాటకరంగానికి మంచి రోజులు రానున్నాయని నాటక రంగ పోషకులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పేర్కొన్నారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శారదా కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం "సత్య హరిశ్చంద్ర" (సింగిల్ క్యాస్టింగ్' పూర్తి నాటకం) విజయవంతంగా ప్రదర్శితమైంది. కార్యక్రమానికి రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హరిశ్చంద్ర పాత్రలో డాక్టర్ నరాలశెట్టి రవికుమార్, విశ్వామిత్రుడిగా ఆచంట బాలాజీ నాయుడు, మాతంగి/ కలహకంటి పాత్రల్లో ఎం.జవహర్ బాబు, సత్యకీర్తి /కాలకౌశికుడు పాత్రల్లో నరాలశెట్టి వెంకటరామయ్య, చంద్రమతిగా రత్నశ్రీ, నక్షత్రకుడిగా గుర్రపుశాల శ్రీను, వీరబాహుడుగా డా.పి.వి.నారాయణ, లోహితాసుడుగా చిరంజీవి బాబు తమ తమ పాత్రలకు న్యాయం చేకూర్చారు. నేపథ్యంలో- హార్మోనియం సిహెచ్ నాగేశ్వరరావు, కె. సత్తిబాబు, డోలక్ వీరరాజు, క్లారినెట్ ఆర్ పైడిరాజు, డ్రెస్ అండ్ మేకప్ బొంత శ్రీనివాసరావు సహకరించారు. నాటకరంగ ప్రముఖులు వరకూరి రామానుజసూరి, మాతంగి విజయరాజు, వి.యజ్ఞనారాయణ, బండారు పద్మ స్మారక అవార్డులు ప్రముఖ హార్మోనిస్ట్ సీహెచ్ నాగేశ్వరరావు, ప్రముఖ నటీమణి రత్నశ్రీ, సీనియర్ నటుడు ఆచంట బాలాజీ నాయుడు, ప్రముఖ స్త్రీ పాత్రధారి ఎం. జవహర్ బాబులకు ప్రదానం చేశారు. డోగిపర్తి శంకర్రావు, నీలం దుర్గారావు, వి.వి.కె.నరసింహారావు, ఎం.ఆర్.ఎస్. ప్రకాశరావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉద్యోగాల పేరుతో యువతకు టెక్ కంపెనీలు వల !

(మొదటి పేజీ తరువాయి)

యువతను మోసగిస్తున్నారు. యువతీ యువకులు వచ్చిన తర్వాత వారికి ఒక పరీక్ష పెడుతున్నారు. దానిలో క్వాలిఫై అయిన వారిని ఉండాలని, మిగిలిన వారిని మళ్లీ పిలుస్తామని పంపేస్తున్నారు. ఇక్కడ మొదలవుతుంది అసలు కథ.. టెక్ కంపెనీ ప్రతినిధులు రంగంలోకి దిగుతున్నారు. మీరు ఎంట్రన్స్‌లో క్వాలిఫై అయ్యినందున ఉద్యోగం వచ్చేసినట్టే అని చెబుతున్నారు. అయితే ముందుగా ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ తీసుకోవాల్సి ఉంటుందని, దానికిగాను రూ.1.40 లక్షలు కడితే సరిపోతుందని ఎంపిక చేసిన వారిని చెబుతున్నారు. అంత డబ్బులు కట్టలేకపోతే ముందుగా రూ.30 వేలు కడితే మిగిలిన అమౌంట్‌కు బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని చెబుతున్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత ఆ రుణం కట్టుకోవచ్చని ఎర వేస్తున్నారు. ఈపని చేస్తే మొత్తం తామే చూసుకుంటామని. ట్రైనింగ్ పూర్తి కాగానే "మీకు ఉద్యోగం ఇప్పించే బాధ్యత కూడా మాదే" అంటూ నమ్మ బలుకుతున్నారు. ఈతంతులో హెచ్‌సిఎల్ కంపెనీని మొత్తం వారికి చూపిస్తారు. అన్నిచోట్లా ఈ విధంగానే కంపెనీలు ఉంటాయని, ఏసీలో కంప్యూటర్ కింద మీరు ఉద్యోగాలు చేసుకోవచ్చని నమ్మ బలుకుతున్నారు. ఇది నిజం అనుకుని ఊహల్లోకి వెళ్లిన యువతీ యువకులు తమ తల్లిదండ్రులను అడిగి డబ్బులు కట్టేందుకు సిద్ధమవుతున్నారు. సొమ్ము కట్టిన తర్వాత ట్రైనింగ్ పీరియడ్ కొనసాగించి, అది పూర్తయిన వెంటనే ఉద్యోగం ఎక్కడ కావాలని అభ్యర్థిని అడుగుతున్నారు. బెంగుళూర్, నాగపూర్, నోయిడా, హైదరాబాద్, చెన్నై, మధురై ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలో ఉద్యోగం ఇప్పించే బాధ్యత తమదని చెప్పి లక్షలు కట్టించుకుంటున్నారు. ఆ కంపెనీ మాటలు నమ్మి వందలాది మంది శిక్షణ తీసుకుంటున్నారు. ఎవరైనా మధ్యలో వెళ్లిపోతే సొమ్ము వదులుకోవాల్సిందే. ఈవిధంగా ట్రైనింగ్ పేరుతో భారీగా వసూళ్లు చేస్తున్నారని తెలుస్తోంది. ఎవరైనా తట్టుకొని నిలబడి ఉద్యోగంలో చేరితే వారికి వచ్చి నెలసరి వేతనం ఎంతో తెలిస్తే ప్రతి ఒక్కరు విస్తుపోతారు. నెలకు రూ.12 వేల నుండి రూ.15 వేలు జీతం వచ్చే ఉద్యోగాలు ఇస్తున్నారు. ఆ జీతం కూడా సరిగా ఇచ్చే పరిస్థితి ఉండదు. ఆ ఉద్యోగం కూడా ఎన్నాళ్ళు ఉంటుందో తెలియదు. అదేవిధంగా బిటెక్ చదువుకున్న యువకులకు ఉద్యోగాల వల విసిరి వారిని ఇంటర్వ్యూల పేరుతో రప్పించి ట్రైనింగ్ ఉచ్చులోకి దించుతున్నారు. బిటెక్ విద్యార్థుల వ్యవహారాన్ని వేరొక కంపెనీ చూసుకుంటోంది. నిరుద్యోగ యువతలే యువతీ యువకులే లక్ష్యంగా ఆయా కంపెనీల ప్రతినిధుల వ్యవహారం సాగుతోంది. గత కొన్నే ళ్లలో ఈ కంపెనీలో వేలాది మంది ట్రైనింగ్లో చేరితే ఉద్యోగం పొందిన వారు వందల్లో కూడా లేరు. అతి తక్కువ వేతనాలతో గొడ్డు చాకిరీ చేయిస్తుండడంతో ఎంపికైన అభ్యర్థులు ఇటు జీతం చాలక, అటు గొడ్డు చాకిరీ చేయలేక ఉద్యోగం మానివేస్తున్నారు. ఆ కంపెనీల ప్రతినిధులకు కూడా కావాల్సింది ఇదే. ఎవరికి వారు మానుకోవడమే. ట్రైనింగ్ పేరుతో లక్షలకు లక్షలు పోగేసుకుంటున్నారు. ఇదొక రకం మోసమని చెప్పాలి.

ఐటి కంపెనీలో జరిగిన మోసం ఇదీ

గన్నవరం మండలం కేసరపల్లిలో మేధా టవర్స్ ఉంది. దానిలో ఐటీ కంపెనీలు ఐదు నడుస్తున్నాయి. వెయ్యి మంది వరకు ఉద్యోగం చేస్తున్నారు. మూడు నెలల క్రితం హాలీవుడ్ అనే ప్రైవేటు కంపెనీ బోర్డు తిప్పేసింది. హైదరాబాదులో యానిమేషన్లో ట్రైనింగ్ ఇవ్వడానికి లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగం పేరుతో కేసరపల్లిలోని మేధా టవర్స్‌లో పెట్టిన హాలీవుడ్ బ్రాంచ్ కంపెనీకి పంపారు. ఏడాది తర్వాత కంపెనీని మూసివేశారు. దీంతో 500 మంది యువకులు ఉద్యోగం పోగొట్టుకొని కంపెనీ వద్ద ఆందోళన చేయాల్సి వచ్చింది. కనీసం ట్రైనింగ్ కోసం ఒక్కో అభ్యర్థి కట్టిన రూ.2 లక్షలైనా ఇవ్వాలని అడిగితే కుదరదని చేతులెత్తేశారు. ఎన్నో ఆశలతో ఉద్యోగంలో చేరిన యువకులకు చివరకు రక్త హస్తాలు మిగులుతున్నాయి. ఈ విధంగా ఉద్యోగాల పేరుతో యువకులను బురిడీ కొట్టిస్తున్న... ఇంకా కొంతమంది మాయ మాటలు నమ్మి సొమ్ము కట్టే నిరుద్యోగ యువతులు ఎంతోమంది ఉన్నారు. అందులో భాగమే హెచ్సీఎల్ కంపెనీలో జరుగుతున్న ఇంటర్వ్యూలు అనే వాదన ఉంది.

హెచ్‌సిఎల్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్న వారు ఉన్నారు

హెచ్‌సిఎల్ కంపెనీ నేరుగా ప్రకటన ఇచ్చి క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తున్నారు. ఇదొక పెద్ద కంపెనీ. తెలుగు రాష్ట్రాలతోపాటు చెన్నై నుంచి కూడా ఇక్కడకు వచ్చి ఉద్యోగాలు చేసుకునే యువకులు ఉన్నారు. వేలల్లో ఇక్కడ యువతీ యువకులు కనిపిస్తారు. వీరిని చూపించి ఇంటర్మీడియట్ వారిని, బిటెక్, డిగ్రీ చేసిన వారిని ఉద్యోగాల పేరుతో ఉచ్చులోకి లాగేస్తున్నారని తెలిసింది. దీనిని నియంత్రించే అధికారులు కనిపించడం లేదు.



పంపిణీని పరిశీలిస్తున్న రంగారావు, కరీముల్లా, కోటేశ్వరరావు

ఇంకా యూరియా కష్టాలే...

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిన రైతులందరికీ సర్దుబాటు చేస్తామని చెప్పడంతో రైతులు సద్దుమణిగారు. సుమారు 500 మంది రైతులకు యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, 375 మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. వీరిలో 275 మందికి మాత్రమే యూరియా పంపిణీ చేశారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ కె.మురళీ కృష్ణ, సొసైటీ చైర్‌పర్సన్ లంకబాబు, సీఈవో రమేష్ బాబు పర్యవేక్షించగా, చల్లపల్లి ఎస్ఐ పివిఎస్ సుబ్రహ్మణ్యం బందోబస్తు నిర్వహించారు.

యూరియా పంపిణీని పరిశీలించిన రైతు సంఘం నేతలు

ఎపి రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, సిఐటియు చల్లపల్లి మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బండారు కోటేశ్వరావు బుధవారం మండలంలోని పిఎసిఎస్‌ల వద్ద యూరియా పంపిణీని పరిశీలించి సక్రమంగా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

ప్రబలిన అతిసార

(మొదటి పేజీ తరువాయి)

రోజుల నుండి న్యూ రాజరాజేశ్వరిపేట అతిసార బాధితుల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. కేర్ అండ్ షేర్ పాఠశాల పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంక్ నుండి పైప్‌లైన్ ద్వారా మంచినీరు సరఫరా అవుతుంది. అయితే కేర్ అండ్ షేర్ వద్ద, వాటర్ ట్యాంక్ సమీపంలో పైప్‌లైన్ల లీకేజీ కారణంగా డ్రైనేజి నీరు చేరి కలుషితం అవుతోందని స్థానికులతోపాటు సిపిఎం, పలు ప్రజాసంఘాల నేతలు...విఎంసి అధికారుల దృష్టికి పలు రూపాల్లో తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి అతిసార బారిన పడి ప్రభుత్వాస్పత్రిలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వాస్పత్రి వైద్యులు మంచినీరు కలుషితం అవుతున్నట్లు గుర్తించి జిల్లా వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు స్పందించి వైద్య సిబ్బందిని రంగంలోకి దింపి సర్వే నిర్వహిస్తున్నారు. డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ సుహాసిని, విఎంసి ప్రజారోగ్య విభాగం అధికారి డాక్టర్ బాబూశ్రీనివాస్ తదితరులు స్థానికులకు పలు సూచనలు ఇచ్చారు. కేర్ అండ్ షేర్ పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

. చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సిపిఎం నేతల వినతి

మృతురాలికి నివాళి

ఆస్పత్రికి వచ్చిన కలెక్టర్ లక్ష్మీశను సిపిఎం విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, విఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తదితరులు కలిసి బాధితులను మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే న్యూరాజ రాజేశ్వరిపేటలో నాగమణి మృతదేహాన్ని రమణరావు, సత్యబాబుతోపాటు నాయకులు టి.శ్రీనివాస్, ఎం.వి.రమణ సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా రమణారావు, సత్యబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో 15 మంది, అర్బన్ హెల్త్ సెంటర్లలో సుమారు 50 మంది వరకు, కేర్ అండ్ షేర్‌లో కొద్దిమంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రజలు గత మూడు రోజులుగా అతిసారతో ఇబ్బందులు పడుతున్నా నగరపాలక సంస్థగానీ, రాష్ట్ర ప్రభుత్వంగానీ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోవటం శోచనీయమన్నారు. మంచినీటి పైప్‌లైన్‌లో మురికినీరు కలిసి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం, అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. సీజనల్ వ్యాధులపై ఇంటింటికీ సర్వే చేయాలని, అందరికీ వైద్య సదుపాయం కల్పించాలని, లీకవుతున్న మంచినీటి పైపులను వెంటనే మార్చివేసి కొత్తవి ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలని, చనిపోయిన మహిళ కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు : కలెక్టర్ ఆదేశం

ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన...ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, అతిసార కేసులు నమోదుకాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వ్యాధి కేసు నమోదైతే పరిసర ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీపీవో పి.లావణ్య కుమారి పాల్గొన్నారు.

విష జ్వరంతో మహిళ మృతి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో విష జ్వరంతో సముద్రాల మహి (22) అనే మహిళ బుధవారం మృతిచెందింది. రెండు రోజుల క్రితం మంగళగిరి ఎయిమ్స్‌లో చేరిన ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గన్నవరం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ అన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్‌కు యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన సేవా పుస్తకంలో నమోదులను సకాలంలో నమోదు చేయాలన్నారు. ఏకోపాధ్యాయులు ఉన్న పాఠశాలలో ఆ ఉపాధ్యాయుడు సెలవు పెట్టినప్పుడు వేరే ఉపాధ్యాయులను పంపించాలన్నారు. వేసవి సెలవులలో విధులను నిర్వహించిన ఉ పాధ్యాయులకు సంపాదిత



వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

సెలవులను సేవా పుస్తకంలో నమోదు చేయాలని చెప్పారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల జీత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యార్థులు పెరిగిన పాఠశాలలో కొత్త ఉపాధ్యాయులను నియమించటకు తగిన ప్రతిపాదనలు జిల్లా విద్యా శాఖ అధికారికి పంపాలన్నారు. సకాలంలో ఏఎఎస్ లను మంజూరు చేయాలన్నారు. కొండపావులూరు, జక్కులనెక్కలం, అజ్జంపూడి, బూతిమిల్లిపాడు ఎంపీపీఎస్ పాఠశాలలకు మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రతి మూడునెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. యూటీఎఫ్ మండల మండల అధ్యక్షుడు జీవి రవిబాబు, దాసరి శివప్రసాద్, తాత శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో మండలంలోని వడ్లమన్నాడు, కవుతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 530 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై పి సి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు కంటి వైద్య



పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత గా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె ప్రసాద్, కె రజనీకుమారి, వల్లభనేని వెంకటసుబ్బారావు, లయన్స్ జోన్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, పెరుమల్లు, నవాబు, చిట్టిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-గన్నవరం: పర్యావరణ పరిరక్షణకు ఇబ్బందిగా మారిన ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించడానికి వీలుగా ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు కంభంపాటి హేమంత కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించి భూమిలో పారవేయడం వల్ల భూసాంద్రత దెబ్బతింటుందని చెప్పారు. కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. దీనితో పర్యావరణం దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని సంకల్పించినట్టు తెలిపారు. జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఇటువంటి ఇబ్బందులు లేకుండా జరగడానికి ప్రయత్నం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మణింద్రనాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బసవ శంకర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్, ఐపీఎ గుడ్లవల్లేరు లోకల్ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గుడివాడ జూనియర్ సివిల్ జడ్జి జిఆర్ కమలామృతం మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్ ఎక్కువ వినియోగించటం వలన వ్యక్తిగత సంబంధాలు తగ్గిపోయాయని చివరికి స్నేహితులతో కూడా తమ మానసిక స్థితిని పంచుకోక పోవడం వలనే ఆత్మహత్యలు ఎక్కువ అయ్యాయన్నారు. తమ చుట్టూ ఉన్న వ్యక్తులతో మంచి సంబంధాలను ఏర్పరచుకొని, కుటుంబాలకు విలువ ఇవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ సాయి దాత్రి, కళాశాల ప్రిన్సిపల్ ప్రధాన అతిథిని మోమెంటుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ పి రవిశ, డాక్టర్ టి ప్రశాంతి, డాక్టర్ టి బాలకృష్ణ, బి సత్య శ్రీ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జాతీయ సేవా పథకం యూనిట్ వన్ ప్రోగ్రాం



అవనిగడ్డలో మాట్లాడుతున్న ఉమారాణి

ఆఫీసర్ డాక్టర్ ఏ వీరకుమారి ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి మాట్లాడుతూ నేడు యువత ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయని తెలిపారు. ఇతరులతో పోలికలు లేకుండా దుబారా ఖర్చులు తగ్గించుకోవడం ఒత్తిడి తగ్గించుకోవడం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి నాగార్జున, చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ డి రాజ్యలక్ష్మి, తోట నరసింహారావు విద్యార్థులు పాల్గొన్నారు.

పాము కాటుకు రైతు మృతి

ప్రజాశక్తి-కోడూరు: పశువుల మేత కోసం వెళ్లి పాము కాటుకి గురై రైతు మృతిచెందిన సంఘటన కోడూరు శివారు నరసింహపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతా వెంకట్రావు (50) వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. తనకి ఉన్న పశువులకు గడ్డి కోసం బుధవారం ఉదయం పొలం వెళ్లి గడ్డి కోస్తుండగా పాటు కాటేసింది. వెంటనే అతనిని అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు డాక్టర్ నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కోడూరు ఎస్సై చాణిక్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంవి కృష్ణారావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎంవి కృష్ణారావు విశిష్ట సేవలు చేశారని పలువురు కూటమి నాయకులు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండల వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకల్లో భాగంగా బుధవారం అవనిగడ్డ వంతెన సెంటర్లోని విగ్రహానికి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవీ నరసింహారావు మంత్రివర్గంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, మత్స్య శాఖ మంత్రిగా నూతన పథకాలు ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టిడిపి మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి శ్రీనివాసరావు, బీసీ వైస్ చైర్మన్ బొచ్చు రఘునాథ ప్రసాద్, అవనిగడ్డ పిఎసిఎస్ అధ్యక్షులు మాదివాడ రత్నారావు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: రొయ్యూరు గ్రామ టిడిపి నాయకులు ఉప్పులూరి గోపాలకృష్ణ బాధిత కుటుంబానికి రూ.35 వేలు ఆర్థిక సహాయం ఏశారు. గ్రామంలో తెల్లాకుల మోహన ఆకాష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. బుధవారం ఆర్థిక సహాయాన్ని టిడిపి అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి గోపాలకృష్ణ అందించారు.



బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి-అవనిగడ్డ: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్ సూచించారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా ఆపాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. జిల్లా మహిళా మండలి వాసవ్య



మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. పంచాయతీ ఈవో బి.అనిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని సమాజంలో బాలికలు మహిళల పట్ల వివక్ష లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ సిహెచ్ శాంతి పాల్గొన్నారు.

20 మందిపై బైండోవర్

ప్రజాశక్తి-ఉయ్యూరు

వినాయక నిమజ్జన ఊరేగింపులో రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన 20 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఉయ్యూరు సిఐ టీవీవీ రామారావు తెలిపారు. సిఐ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రెండురోజుల క్రితం జరిగిన వినాయక నిమజ్జన ఊరేగింపు లో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన ఉయ్యూరులో వివిధ ప్రాంతాలకు చెందిన 20 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని తెలిపారు.

రేపల్లె ఇన్చార్జిని కలిసిన గౌతమ్

ప్రజాశక్తి-అవనిగడ్డ: రేపల్లె నియోజకవర్గం వైసిపి ఇన్చార్జ్ ఈపూరి గణేష్‌ని అవనిగడ్డ నియోజకవర్గం వైసీపీ యువనేత బడే గౌతం మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపార. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అనారోగ్య కారణంగా హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా చెరుకుపల్లిలోని వారి కార్యాలయంలో గణేశ్‌ని కలిసి పరామర్శించినట్లు గౌతం తెలిపారు.



కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-మొవ్వ: గర్భవతులు, బాలింతలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకొని సంపూర్ణ ఆరోగ్యం వంతులుగా కొనసాగాలని గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి సూచించారు. కూచిపూడి గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్వాడీలు సంయుక్తంగా ఉత్తర దళితవాడలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషక ఆహార వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి సెక్టార్ సూపర్వైజర్ ఏఎస్ కళ్యాణి,



గుడ్లవల్లేరులో...

పారిశ్రామికవేత్త కొండవీటి అమరబాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు:** కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలని కంకిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ కె బేబీ సుకన్య అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ హైస్కూల్లో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధురి, సూపర్వైజర్ జి విజయలక్ష్మి, రత్నకుమారి, దుర్గా భవాని, హైస్కూల్ హెచ్ఎం సుమలత పాల్గొన్నారు. **ఉయ్యూరు:** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కిశోర బాలికలు, మహిళల్లో రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవచ్చని కమ్యూనిటీ హెల్త్ సూపర్వైజర్ వీరరాఘవమ్మ అన్నారు. ఉయ్యూరు 18వ వార్డులో బుధవారం కిశోర బాలికలలో రక్తహీనత, మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ, జరీనా, పద్మజ, కనక రత్నం పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** కిశోర బాలికలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్స్ డి మేరీ, నసీర్ ఉన్నిసా అన్నారు. మండలంలోని కవుతరం



మొవ్వలో...

జిల్లా పరిషత్ హైస్కూల్, అంగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మహంకాళరావు పాల్గొన్నారు. **పామర్రు:** బాలికలకు వివాహాలు చేయడం ఆ కార్యక్రమాల్లో పాల్గొన్నడం చట్టపరంగా నేరమని వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎన్.రాణి అన్నారు. మహిళా రక్షణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సంకల్ప కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కురుమద్దాలిలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కార్యాలయంలో బుధవారం కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కళ్యాణి, సూపర్వైజర్ ఎస్.విజయకుమారి పాల్గొన్నారు.

పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణి ప్రభాకర్‌రావు 78వ జయంతి సందర్భంగా వక్కలగడ్డలోని స్వగృహంలో బుధవారం ఆయన చిత్రపటం వద్ద గ్రామ ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళితవాడలోని ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు,



స్టేషనరీ పంపిణీ చేశారు. పాఠశాల అభివద్ధికి ఆయన సోదరుడు శివరామకష్ణ రూ.5 వేలు విరాళం అందచేశారు. ఈ కార్యక్రమాలలో గ్రామ ప్రముఖులు హనుమాన్ల సురేంద్రనాథ్ బెనర్జీ, దాసు సీతారామరాజు, ఒగిరాల నాగమల్లేశ్వరరావు, గోగినేని రత్తయ్య, నడకుదుటి శ్రీనివాసరావు, అడ్డాడ చంద్రయ్య, తులసి, శ్రీహరి, రామకృష్ణ, తేజ తదితరులు పాల్గొన్నారు.



'కలర్స్ హెల్త్ కేర్' నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రముఖ హెల్త్ కేర్ సంస్థ 'కలర్స్' విజయవాడలో కొత్త బ్రాంచిని ఏర్పాటు చేసింది. శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీలో 'కలర్స్ హెల్త్ కేర్ 2.0' నూతన బ్రాంచ్‌ను హీరోయిన్ సంయుక్త మీనన్ బుధవారం ప్రారంభించారు. ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆమె స్వయంగా పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో నాణ్యమైన హెల్త్ కేర్ సేవలు అందిస్తున్న కలర్స్ హెల్త్ కేర్ నిర్వాహకులకు ఈ సందర్భంగా ఆమె అభినందించారు. కలర్స్ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట శివాజీ కూన మాట్లాడుతూ "2004లో ప్రారంభమైన కలర్స్ హెల్త్ కేర్ ఇప్పటి వరకు వేలాది మంది కస్టమర్లను సంతృప్తి పరిచిందని తెలిపారు. ఈ నేపథ్యంలో 'కలర్స్ హెల్త్ కేర్'ను దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలో ఇప్పుడు విజయవాడలో కూడా బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ.. అందంగా ఆరోగ్యంగా ఉండాలన్న ప్రతి ఒక్కరి కోరికకు మద్దతుగా కలర్స్ హెల్త్ కేర్ నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 5 ఎం మీడియా ఆధ్వర్యంలో జైదీప్ నిర్వహించారు.

44వ డివిజన్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

స్థానిక 44 డివిజన్ అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.17 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు 44 డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి చెప్పారు. బుధవారం గంజి యలమందయ్య వీధి పక్కన రేషన్ డిపో సందు సైడ్ డ్రైన్స్, సిసి రోడ్లు రూ.9.88 లక్షల వ్యయంతో, నాలుగు స్తంభాల సెంటర్ నాగేంద్ర స్వామి కొండపైన సైడ్ వాల్ రేజింగ్, స్టెప్స్, సైడ్ డ్రైన్స్ రూ.7.41 లక్షల వ్యయంతో చేయనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ 44వ డివిజన్ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా తాము పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు వీరంకి సత్యనారాయణ, ఏతం రామకృష్ణ, ఇమ్యూనిటీ సెక్రటరీ నాగమల్లేశ్వరరావు, వర్క్ ఇన్స్పెక్టర్ శివ, కాంట్రాక్టర్ బత్తుల వెంకటేష్, పాల్గొన్నారు.



తీక్షణ్ సాయికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా శ్రీ వాసవి సేవా సమితి యూత్ ఉపాధ్యక్షులు కుంచపర్తి సాయిరాం కుమారుడు కుంచపర్తి తీక్షణ్ సాయి తన చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. కేవలం సంవత్సరం 9 నెలల వయసులోనే 70 మంది బంధువులను పేరుతో గుర్తుపట్టి విశేష ప్రతిభ చూపి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్నాడు. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వయంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ "తీక్షణ్ సాయి రికార్డు కేవలం మేధస్సుకు నిదర్శనం మాత్రమే కాకుండా, తెలుగు కుటుంబ వ్యవస్థలో బంధాలకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు సాయిరాం, లక్ష్మీ భవాని మాట్లాడుతూ "మా బిడ్డ ప్రతిభకు వచ్చిన ఈ గుర్తింపు మా కుటుంబానికి గర్వకారణం" అని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మిరియాల రమణ, వనమా సూరి, చారుగుండ్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్

ప్రజాశక్తి-విజయవాడ

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నూతన జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఐదవ మహాసభ బుధవారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగింది. ముందుగా యూనియన్ మాజీ కార్యదర్శి ఎం డేవిడ్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించగా, కార్మికోద్యమానికి విశేష సేవలందించి ఇటీవల కాలంలో మృతి చెందిన సిపిఎం అగ్రనాయకులు సీతారామ్ ఏచూరి, వి.ఎస్ అచ్యుతానందన్, సన్యాల్ తదితరులకు మహాసభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, కొత్త పిఆర్సి కమిటీ వేసి న్యాయమైన వేతనాలు చెల్లించాలని, పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు యస్ జ్యోతిబసు మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోనే కాకుండా, జిల్లాలోని ఆయా మునిసిపాలిటీల్లో స్థానికంగా నెలకొన్న కార్మికుల సమస్యలను స్థానిక పాలకవర్గాలు, అధికారులు తక్షణమే దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు స్టీఫెన్ బాబు, టి ప్రవీణ్, సిహెచ్ నాగరాజు, ఎం సురేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ 33 మందితో జిల్లా నూతన కమిటీ ఏర్పడింది. యూనియన్ ఎన్టీఆర్ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.జ్యోతిబసు, ఎన్ సి హెచ్ శ్రీనివాస్, కోశాధికారిగా డి.సైదాతో పాటు 12 మంది ఆఫీస్ బేరర్స్‌గా, మరో 21 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కంచికచర్ల : ఇటీవల మండలంలోని పరిటాల గ్రామంలో వినాయక శోభాయాత్రలో రెండు వర్గాల మధ్య తలెత్తిన రాళ్లదాడి ఘటనలో గాయపడిన బాధితులను మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధితులపై జరిగిన దాడి హేయమైన చర్యగా వర్ణించారు. బాధితులపైనే తిరిగి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగ ప్రసాద్ మాట్లాడుతూ పోలీసులు బాధితుల పక్షాన నిలబడాలని కోరారు. గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ మాట్లాడుతూ గణేష్ శోభాయాత్రపై రాళ్ల దాడి అమానుషమని, చిన్న పిల్లల్ని సైతం రాళ్లతో కొట్టి గాయపరచడం హేయమైన చర్య అని అన్నారు.

షాపు ఎంప్లాయీస్ యూనియన్ నగర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-విజయవాడ : షాపుల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, వారి సమస్యలపై విశాల ఐక్యతతో ఉద్యమించడం జరుగుతుందని షాపు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి వై సుబ్బారావు, అధ్యక్షులు జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. షాపు ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ నగర 15వ మహాసభ ఈ నెల 12న స్థానిక అమరావతి బాలోత్సవం భవనంలో జరుగుతున్న నేపథ్యంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... షాపుల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ నాయకులు ఎం.బాబూరావు, ఎం.సోమేశ్వరరావు, షాప్ నాయకులు సి.హెచ్ శివరాం, పి.హనుమంతరావు, ఏ.నాగరాజు, ఉదయ శంకర్, సాంబశివరావు, మహేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్అండ్ టెక్నాలజీలో బుధవారం ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ మనోవైద్య నిపుణులు డాక్టర్ అయోధ్య ఆర్.కె. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు, అధ్యాపకులకు ఆత్మహత్యలకు దారితీసే కారణాలు, వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై విలువైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సి.ఎ. చిట్టా అమర్ సుధీర్, ట్రెజరర్ కాజా రాఘవయ్య, ఏ.ఓ. నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణ కుమార్, పాల్గొన్నారు.


చైన్ స్నాచర్ అరెస్ట్

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

విజయవాడ రైల్వే స్టేషన్‌లో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును జిఆర్పి పోలీసులు విజయవంతంగా ఛేదించారు. జిఆర్పి సిఐ రమణ విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 23న పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి నుండి వరంగల్‌కు ప్రయాణించిన బండి రాజ్యలక్ష్మి వద్ద నుండి 25 గ్రాముల బంగారు నానుతాడు దొంగతనం జరిగినదని తెలిపారు. రైలు విజయవాడ స్టేషన్ నుండి బయలుదేరుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని చెప్పారు. బాధితురాలు 25న విజయవాడకు వచ్చి ఫిర్యాదు చేశారని చెప్పారు. నిందితుడు తంట్రికంటి రమేష్ (29), మహబూబ్‌నగర్ (తెలంగాణ)కు చెందినవాడని ఇతను 2024లో కూడా చైన్ స్నాచింగ్ కేసులో అరెస్టై జైలు శిక్ష అనుభవించి వచ్చాడని చెప్పారు. సెప్టెంబర్ 10న విజయవాడ రాజగోపాలాచారి వీధిలోని జైహింద్ కాంప్లెక్స్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు నిందితుడి వద్ద నుండి 25 గ్రాముల బంగారు నానుతాడుతో పాటు, 2024 డిసెంబర్‌లో జరిగిన మరో కేసులో 40 గ్రాముల బంగారు నానుతాడు కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యం

- హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి



విజయవాడ : నిరంతరం ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా వారు పెట్టిన పెట్టుబడి మరింత వృద్ధి అయ్యేలా ప్లాట్ల విక్రయాలు చేస్తున్నామని హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ చైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి తెలిపారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా అనేక ప్రాజెక్టులు చేపట్టి ఖాతాదారుల ఆదరాభిమానాలను చూరగొన్నామన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ప్రాజెక్టులతో ఖాతాదారులకు మంచి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలోనూ, వ్యాపారంలోనూ అత్యంత విశ్వసనీయమైన సంస్థగా పేరు పొందినట్లు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా అత్యాధునికమైన, సౌకర్యవంతమైన 16 ప్రాజెక్టులు దిగ్విజయంగా పూర్తి చేసి, అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎదురుచూస్తున్న మరో నూతన 17వ ప్రాజెక్ట్ ఆగిరిపల్లిలో 'ఫార్చ్యూన్ వ్యాలీ' ప్రారంభించామన్నారు. 18వ ప్రాజెక్ట్ పరిటాలలో ఫార్చ్యూన్ ప్యారడైజ్ పేర్లతో ఎపి సిఆర్‌డిఎ అప్రూవ్ ప్రాజెక్ట్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. కొత్తగా ఆగిరిపల్లిలో ఫార్చ్యూన్ వ్యాలీ పేరుతో మెగా వెంచర్‌కు శ్రీకారం చుట్టామన్నారు. సరసమైన ధరలకు ప్లాట్లను కొనుగోలు చేయాలనుకునే వారికి ఆగిరిపల్లిలో 'ఫార్చ్యూన్ వ్యాలీ" ఓ గొప్ప సదవకాశంగా ఉందన్నారు. వినూత్నమైన లేఅవుట్ డిజైన్‌తోపాటు సకాలంలో ప్రాజెక్ట్ పూర్తి చేసి.. వెంటనే ప్లాట్ కొనుగోలుదారులకు అందజేస్తామని తెలిపారు. విజయవాడ-నూజివీడు రోడ్డులోని వడ్డమాను గ్రామంలో ఉన్న తమ మొట్టమొదటి 25 ఎకరాల ఫామ్ హౌస్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్‌ను ఖాతాదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ ప్రీమియం ప్రాజెక్ట్‌లో 186 చదరపు గజాల నుండి ఓపెన్ ప్లాట్లను అందిస్తున్నామని, ఈ ప్రాజెక్టు ప్రశాంతమైన వాతావరణంలో ఆధునిక హంగులతో రూపొందించబడిందని వివరించారు. 24 గంటలు రవాణా సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. విద్యా సంస్థలకు, ఆసుపత్రులు అతి దగ్గరలో ఉందని తెలిపారు. ప్రవేశ ముఖద్వారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టు చుట్టూ ప్రహరి గోడ ఉందన్నారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ సదుపాయం, 3ఫేస్ కరెంట్, ఎల్ఇడి వీధి లైట్లు, 40, 33 అడుగుల వెడల్పుతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వంద శాతం వాస్తు ప్రకారం గృహనిర్మాణం, తాగునీటి సదుపాయం, ప్రతి పాటు నంబర్లు సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుందరమైన పార్కు ఏర్పాటు, 25 అడుగుల గౌతమ బుద్ధుని విగ్రహం, క్రికెట్ నెట్, పిల్లలకు ఆట స్థలం, షటిల్ కోర్టులు, -వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశామన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ వంటి ఆధునిక హంగులతో ఈ సరికొత్త ప్రాజెక్టు అందరు ఇష్టపడే విధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హరివిల్లు సంస్థ సీఈవో జాస్తి ప్రసన్న చౌదరి మాట్లాడుతూ గురువారం పుట్టినరోజు వేడుకను జరుపుకుంటున్న లక్ష్మణ చౌదరికి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, మరెంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 5
గురువారం 11 సెప్టెంబర్ 2025

రైతులందరికీ యూరియా అందిస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-చల్లపల్లి: జిల్లాకు కావాల్సినంత యూరియా వస్తుందని, రైతులందరికీ సరఫరా చేస్తామని, ఎవరు ఆందోళన చెందవద్దని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం చల్లపల్లి మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. డాలిపర్రు గ్రామానికి చెందిన రైతులు గొల్లపూడి జగన్మోహన్, భవాని ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ కొంతమంది రైతులు ఒకటవ డోసు యూరియా వేశారని, మరికొంతమంది రైతులు రెండవ డోసు వేసారని కలెక్టర్‌కు తెలిపారు. ఎకరాకు ఇది వరకు మూడు కట్టల యూరియా సరిపోయేదని, బెంగాల్ సేద్యం చేయడం వల్ల 4 నుంచి 5 కట్టల యూరియా అవసరం వస్తుందన్నారు. అంతేకాకుండా కలుపుతో కలిపి యూరియా వేయడం జరిగిందన్నారు. విత్తనాల కోసం అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందన్నారు. యూరియా ఇంకా సరఫరా చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ యూరియాపై రైతులు ఎక్కువగా ఆధారపడి ఉండరాదని, ఎక్కువ యూరియా వాడితే చేను దెబ్బతింటుందని తెలిపారు. రైతులందరూ ప్రకృతి సేద్యం వైపు దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ సంఘంలోని యూరియా సరఫరా పంపిణీ రికార్డులను పరిశీలించారు. యూరియా బస్తాలు ఇచ్చినప్పుడు రైతుల వివరాలను ఆన్లైన్లో వెంటనే నమోదు చేయాలని, యూరియా దుర్వినియోగం కాకుండా చాలా జాగ్రత్తగా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, వ్యవసాయ శాఖ ఏడి శ్యామల, మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సహకార సంఘం కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.


పెదమద్దాలిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పామర్రు: ప్రతి రైతుకూ సరిపడా యూరియా అందిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం పామర్రు మండలంలోని పెదమద్దాలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆకస్మిక తనిఖీ చేసి యూరియా పంపిణీ స్థితిగతులపై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఎకరానికి కనీసం అరకట్ట లేదా కట్ట యూరియాను అందించాలని ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ క్రమంలో ఆయన గత వారంలో జరిగిన యూరియా పంపిణీ వివరాల జాబితాను పరిశీలించి ఇప్పటి వరకు ఎంత పంపిణీ చేశారు, ఇంకా ఎంత అవసరం ఉంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సొసైటీ కింద ఉన్న పెదమద్దాలి, బల్లిపర్రు, కురుమద్దాలి, ఉరుటూరు వంటి నాలుగు గ్రామాలకు ఇప్పటి వరకు 159 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, ఇంకా 40 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టామని అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో ప్రతిపాదించిన యూరియాను సొసైటీకి తప్పనిసరిగా సరఫరా చేస్తామని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రతి రైతుకూ సరిపడా యూరియాను సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, తహసిల్దార్ రవికాంత్, మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి, బల్లిపర్రు సర్పంచ్ సుధాకర్, ఆర్ఐ రాము, సిఐ సుభాకర్, పాల్గొన్నారు.

నేడు 2,600 టన్నులు రాక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): యూరియా కొరతపై రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని, జిల్లాలో సమృద్ధిగానే యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుండి ఇప్పటివరకు 4380 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందన్నారు. ఆ యూరియాను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. గురువారం మరో 2,600 మెట్రిక్ టన్నులు, శుక్రవారం మరో 1,800 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, వ్యవసాయ శాఖ డిడి మనోహర్ రావు, ఏడి మనిధర్, ఏవో శాంత తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గన్నవరం: మండలంలోని దావాజీగూడెం శివారు రాజీవ్ కాలనీ, బీసీ కాలనీల్లో బుధవారం దోమల నిర్మూలనకు మందును చల్లించినట్లు బుద్ధవరం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో పాటు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఖాళీ స్థలాల్లో, మురుగు కాలువల్లో నీరు నిలిచి దోమలకు నిలయంగా మారినట్లు చెప్పారు. దోమల కుట్టడం వల్ల పిల్లలకు, పెద్దలకు సాధారణ జ్వరాలు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య శాఖ సహకారంతో పంచాయితీ ఆధ్వర్యంలో దోమల నిర్మూలనకు బయటెక్స్ మందును పిచికారి చేయిస్తున్నట్లు వివరించారు. పంచాయతీ పరిధిలో ఉన్న బుద్ధ వరం, విద్యానగర్, ఓసి కాలనీ, బీసీ కాలనీ, పామర్తి నగర్ ఏరియాలో పూర్తిస్థాయిలో మందు చల్లడం జరుగుతుందన్నారు.

చిరంజీవమ్మకు నివాళి

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు తల్లి తూము చిరంజీవమ్మ (97) బుధవారం మొవ్వలోని చిన్న కుమారుడు అంబేద్కర్ ఇంటి వద్ద మరణించారు. ఆమె భౌతికకాయాన్ని బియస్‌పి పామర్రు నియోజకవర్గ ఇంచార్జి వంపుగాని రమేష్, పాగోలు రమేష్ బాబు, బండి సహదేవుడు , కూరపాటి బాలకృష్ణ, మాతంగి కిషోర్‌బాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

చినముత్తేవి వంతెన మరమ్మతులకు మోక్షం

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలం చిన ముత్తేవి గ్రామంలో అయినంపూడి డ్రైనేజీపై శిథిల అవుతున్న వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని సిపిఎం, గ్రామస్తులు అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేసిన నేపథ్యంలో పాడైపోయిన రేకులను తొలగించి కొత్త రేకులతో రిపేర్ నిర్మాణ పనులు గత మూడు రోజులు కొనసాగుతున్నాయి. ఈ వంతెనపై భారీ వాహనాలకు ప్రవేశం లేకుండా చర్యలు చేపడితే ప్రస్తుతం చేపడుతున్న మరమ్మతు పనులు ఉపయోగకరంగా ఉంటాయని సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు.

యూరియా ఎప్పుడొస్తుందో..?

ప్రజాశక్తి-గన్నవరం: యూరియా దొరక్క గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్టాకు ఎప్పుడొస్తుందో తెలియడం లేదు. బస్తా ఎరువు కోసం పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నారు. సరుకు తక్కువగా రావడం, అన్నదాతలు అధిక సంఖ్యలో ఎగబడుతుండడంతో ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసుల బందోబస్తు మధ్య పంపిణీ చేస్తున్నారు. డిమాండ్ మేరకు యూరియా సరఫరా లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. గతేడాది ఖరీఫ్ ఇదే సమయానికి 57 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ ఏడాదీ అదే స్థాయిలో జరగడంతో అంచనా మేరకు ఎరువులు రాలేదు. వర్షాలు కురవడంతో 38 వేల ఎకరాల్లో వరి సాగు మొదలైంది. అంతకుముందు వేసిన మొక్కజొన్న, పత్తి, చెరకు పంటలకు జూన్, జూలైలో వచ్చిన వంద టన్నుల యూరియాను వాటికి వినియోగించారు. దీంతో వరికి అవసరం పెరిగి కొరతకు కారణమైంది.

గన్నవరం డివిజన్ పరిధిలో వరి 38,518 ఎకరాలు, జొన్న 645, పత్తి 7,150 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇంత వరకు పీఏసీఎస్‌లకు 744, ఆర్ఎస్కేలకు 973 మెట్రిక్ టన్నులు కేటాయించగా ప్రైవేటు డీలర్ల వద్ద 874 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. యూరియా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. పురుషోత్తపట్నం, ముస్తాబాద్, సూరంపల్లి, వీరపనేనిగూడెం, ఉంగుటూరు, తేలప్రోలు, బాపులపాడు మండలంలో, విజయవాడ రూరల్ మండలంలో సొసైటీల వద్ద వందలాది మంది బారులు తీరడంతో పోలీసు బందోబస్తుతో ఒక్కో బస్తా చొప్పున అందించారు. ఇంకా ఒక్కో సొసైటీకి 1500 నుంచి రెండు వేల కట్ల వరకు వస్తే కొంతవరకు ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే 15 రోజులు వరికి పదును దాటి పోయిందని, ఇంకా 15 రోజుల తర్వాత మూడో దఫాకు వెళ్లిపోతామని అప్పుడు అరకట్ట వేయాల్సి ఉండగా రెండు కట్టలు వేసినా ఉపయోగపడదని చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి యూరియా సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

15న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఈ నెల 15న విజయవాడ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజనాల సురేష్ కోరారు. బుధవారం హనుమాన్ జంక్షన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికుల అడ్డాల వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్దరణ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 మాసాలు గడుస్తున్నా నేటికీ సంక్షేమ బోర్డు గురించి కానీ, భవననిర్మాణ కార్మికుల సమస్య గురించి కానీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే అనేక పర్యాయాలు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాల ద్వారా కోరినా కనీస స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రాజులపాటి కొండలు, టౌన్ కమిటీ అధ్యక్షులు వడ్డీ గిరిధర్, మండల నాయకులు సాంబశివరావు, రాము, నాగేళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** ఈ నెల 15వ తేదీన రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం అవనిగడ్డలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అన్నపురెడ్డి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యాసం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మాదాసు కుమార్, కమిటీ సభ్యులు బండారు భూషయ్య, బండ్రెడ్డి సురేష్, రాజనాల వీరాంజనేయులు, మాదాసు చిన్న తదితరులు పాల్గొన్నారు.


హనుమాన్‌జంక్షన్‌లో మాట్లాడుతున్న సురేష్

సర్పంచ్ లక్ష్మీమౌనిక జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం: జీవితంలో మంచి పనులు చేసిన వారికే జనంలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఏఎంసి చైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. బుధవారం కేసరపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్‌ను ఆమె కట్ చేశారు. పంచాయితీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని లక్ష్మీ మౌనిక చెప్పారు. బసవరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఆమె అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గన్నవరం జడ్పిటిసి ఎలిజబెత్ రాణి, తెంపల్లి సర్పంచ్ కొలుసు శిరీష, వీరపనేనిగూడెం సర్పంచ్ జేజమ్మ, మాదల వారి గూడెం సర్పంచ్ లక్ష్మీప్రసన్న, ఎంపీటీసీలు మరీదు లక్ష్మీ దుర్గ, సొంటి కిషోర్, కేసరపల్లి ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు, టిడిపి నాయకులు రాజులపాటి శ్రీనివాసరావు, సోమయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు.



ఎరువులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం: రైతులకు ప్రభుత్వం వెంటనే యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని గన్నవరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి రామచంద్ర జోషి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గన్నవరం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరువుల కొరత నివారించి చీకటి విక్రయాలు అరికట్టి రైతాంగానికి ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలని కోరారు. ఖరీఫ్ పంట వేసి 40 రోజులు దాటినా పంటకు యూరియా అందకపోతే దిగుబడి తగ్గి రైతుకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ సమావేశంలో రామ్మోహన్‌రావు, శోభన చలపతిరావు పాల్గొన్నారు.

న్యూలైఫ్ అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరులో న్యూలైఫ్ 108 అంబులెన్స్ వాహనాన్ని బోడె వెంకట్రామ్ ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణతో కలసి బుధవారం ప్రారంభించారు. 108 అంబులెన్స్కు నూతన వాహనం ఏర్పాటుచేయగా స్థానిక ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, ప్రభుత్వ వైద్యశాల అబివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, గుర్నాధరావు, అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, ఈఎం వెంకటేశ్వరరావు, అఖిల్, నాగరాజు, గంగాభవాని, రామమోహన్ రావు, శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.



బీమా అందజేత

ప్రజాశక్తి-కోడూరు: ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు అప్పికట్ల పోతురాజు కుటుంబానికి ఆ పార్టీ రూ.5 లక్షల బీమా పరిహారాన్ని అందజేసింది. బుధవారం కోడూరు మండల పరిధిలోని జరుగువానిపాలెం గ్రామానికి వెళ్లి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, జరుగు పోతురాజు, యర్రంశెట్టి దామోదర్, తోట దామోదర్, జరుగు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఆయుష్మాన్ భారత్ గురించి అవగాహన కలిగి ఉండాలని ఉషారామా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి వి శ్రీహరిబాబు అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ విద్యార్థులు తేలప్రోలు గ్రామంలో ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, వైద్య సేవలను ఎలా పొందాలి, ఆరోగ్య కార్డులు పొందే విధానాలను, మరియు ఆరోగ్య భీమా ప్రయోజనాల గురించి వివరిస్తూ పాదయాత్ర ద్వారా పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు.





లేబర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తిరువూరు

నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పనిచేయించి పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న జరగనున్న రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం తిరువూరులో సిఐటియు నేతలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు ఎస్వీ భద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన 12, 14 సర్కులర్‌ను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డును కొనసాగించాలని, కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ క్లైమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరరావు, నాయకులు ఆకుల రవి, మరకాల ఇశ్రాయేలు, ఎం.చింతయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి షేక్ కాసిం, పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా ఉండాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సచివాలయ సిబ్బంది ప్రభుత్వంలో భాగమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని కొండపల్లి మునిసిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. బుధవారం కొండపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో సచివాలయం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఒక్కో సచివాలయం పరిధిలో మూడు వార్డులు అనుసంధానమై ఉన్నాయని, ఆయా వార్డుల్లో సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సచివాలయ సిబ్బంది కూడా మునిసిపాలిటీ కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా పాలన సులభతరంగా ఉంటుందని, మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మునిసిపాలిటీ ఇన్చార్జి కమీషనర్ మౌస్మీ, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, ఆరై రామకృష్ణ, పాల్గొన్నారు.



సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు

పోలీసులకు రైతు సంఘం నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మైలవరం

రైతు సంఘం నాయకులు, సిపిఎం గురించి అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రైతు సంఘం నాయకులు మైలవరం సిఐ దాడి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. మైలవరంలో మంగళవారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం సమావేశంలో యూరియాను రైతులకు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో తెలుగుదేశం పార్టీకి చెందిన జి కొండూరు మండలం కవులూరు పిఎసిఎస్ అధ్యక్షుడు చెరుకూరి గంగాధర్ పేరుతో, మల్లి వసంత పేరుతో కమ్యూనిస్టు పార్టీలు, సిపిఎం నాయకుల గురించి అసభ్యకరమైన వాఖ్యలతో సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. ఈ పోస్టులు పెట్టిన చెరుకూరు గంగాధర్, మల్లి వసంతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవెంకటరెడ్డి, పివి ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి మాధవరెడ్డిలు సిఐ చంద్రశేఖర్‌ను ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సిపిఎంపై చేసిన విమర్శలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మైలవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రావుల సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు రావూరి రమేష్ బాబు, సిపిఎం మండల కార్యదర్శి సి హెచ్ సుధాకర్, చిలుకూరు సుబ్బారెడ్డి, ఇసాక్ పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి : జెసి

ప్రజాశక్తి-ఎ.కొండూరు

సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్య బోధన అందించడంతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎ.కొండూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) బుధవారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలలో వందలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్ సంక్షేమ అధికారులపై ఆధారపడి ఉంటుందన్నారు. అధికారులు అత్యంత బాధ్యతతో విద్య ఆరోగ్యం క్రమశిక్షణ వంటి విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వసతి గృహం నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి నిర్వహించినప్పుడే విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. విద్యార్థులకు మాదక



ద్రవ్యాలు, మత్తుపదార్థాలు, చెడు అలవాట్లు దరికి చేరకుండా అప్రమత్తతతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం విద్యార్థినుల హాజరు రికార్డులు, వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్‌డివో కె.మాధురి, తహశీల్దార్ కె.లక్ష్మీ, ఎంపిడివో ఎస్. శ్రీనివాసరావు, ఎంఇవో ఈవిఎస్ కేశవరావు, పాఠశాల ఎస్‌వో శ్యామల, పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని గౌరవరం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు "లయన్స్ ఇంటర్నేషనల్." ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇవ్వటం జరిగింది. శిక్షణకర్తగా లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా జిఐఎస్ఎస్ ఛైర్మన్ లయన్ డాక్టర్ యర్రంరెడ్డి గాంధీ వ్యవహరించారు. విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలు సాధించడం కోసం పాఠశాల స్థాయి నుండి మంచి ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని, క్రమశిక్షణ, కృషి, పట్టుదల ఉండాలని, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఓటమి వచ్చినప్పుడు కంగిపోకూడదని లక్ష్యాన్ని చేరేవరకు నిరంతరం కషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ సెక్రటరీ చెరుకుమల్లి శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం గద్దె సూర్యకుమారి, ఉపాధ్యాయులు మహేశ్వర వెంకటేశ్వరరావు, పూసపాటి కవిత, రాజేష్, పాల్గొన్నారు.

యూరియా పంపిణీపై అపోహలొద్దు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

యూరియా పంపిణీపై అపోహలు వద్దు అని ఇబ్రహీంపట్నం తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి యడవల్లి రజని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఇప్పటి వరకు 549.18 క్వింటాళ్ల యూరియా వచ్చిందని, అందులో ఇప్పటి వరకు 526.78 క్వింటాళ్ల యూరియా ఇబ్రహీంపట్నం మండల రైతులకు అందించినట్లు తెలిపారు. ఇంకా మండలంలో 22.4 క్వింటాళ్ల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని డివిఆర్ నగర్‌లో గల సిఐటియు కార్యాలయంలో మంగళవారం జగ్గయ్యపేట సిఐటియు మండల ఎనిమిదవ మహాసభ సిఐటియు మండల అధ్యక్షురాలు డి సుధారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ కమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, స్కీం వర్కర్లను, కార్మికులకు గుర్తించి, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా డి సుధారాణి, కార్యదర్శిగా షేక్ గౌస్ మియా, కోశాధికారిగా బత్తుల బుజ్జితోపాటు మరో 21 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు సోమోజు నాగమణి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ అల్లాబీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పారా ఎలకమ్మ, బత్తుల గుణసుందరి, షేక్ బాజీ పద్మ, రామారావు పాల్గొన్నారు.

స్వచ్ఛ జగ్గయ్యపేటగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక డంపింగ్ యార్డ్‌లో లెగిసి వేస్ట్‌ను తొలగించే ప్రక్రియ ఈ నెల 11వ తేదీ నుంచి మొదలవుతుందని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 40 యేళ్లగా విలియంపేట పరిసర ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ యంత్రం ద్వారా లెగిసి వేస్ట్ ఏరివేత ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. జగ్గయ్యపేటను స్వచ్ఛ జగ్గయ్యపేటగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- నందిగామ : రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.గోపి పర్యవేక్షణలో నందిగామ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఈ నెల 13న జరుగుతుందని నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి, నందిగామ మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారులు వారి న్యాయవాదులను సంప్రదించి సత్వరం రాజీ చేసుకోవాలని కోరారు.



బ్లాక్ మార్కెట్‌కు తావులేదు : పిఎసిఎస్ చైర్మన్లు

ప్రజాశక్తి- నందిగామ : ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని, బ్లాక్ మార్కెట్‌కి ఎక్కడా తావులేదని నందిగామ మండల పిఎసిఎస్ చైర్మన్లు తెలిపారు. నందిగామలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో కోట్ల రూపాయల ముడుపులు కూడబెట్టుకున్నవారే ఇప్పుడు రైతు కోసం పోరాటం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. సమావేశంలో నందిగామ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్, పిఎసిఎస్ చైర్మన్లు జమ్మలమూడి హనుమంతరావు, మద్దుకూరి రామారావు, గర్నేపూడి సురేష్, ఎం సురేష్, గాడిపర్తి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ పటమట ఈ సేవ కేంద్రం వద్ద ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. పటమట ఈ సేవ కార్మికుల అడ్డా వద్ద నగర ప్రధాన కార్యదర్శి వివి రాజు మాట్లాడుతూ సెప్టెంబర్ 15న భవన నిర్మాణ కార్మికులు పని బంద్ చేసి రాష్ట్ర లేబర్ ఆఫీస్ ధర్నా ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వై.వాసు, హరికృష్ణ, పరస కిరణ్ కుమార్, పీత చెన్నకేశవరావు, సైదా, సింహాచలం బొమ్మిడాల పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునఃరుద్ధరించాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ తెలిపారు. లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని విజయంతం చేయాలని కోరుతూ ఎన్.టి.ఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కొండపల్లి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివమణి, భాషా ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పని చేయించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ శివమణి, సెక్రటరీ ఎస్‌కె బాషా, పాల్గొన్నారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ఎ.కొండూరు : ఎ. కొండూరు మండలంలోని 7 సహకార సంఘాల్లో యూరియాను రైతులకు పారదర్శకంగా అందిస్తున్నట్లు తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి తెలిపారు. బుధవారం మండలంలోని పోలిశెట్టిపాడు సహకార సంఘం వద్ద యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తహశీల్దార్ కె.లక్ష్మీ, ఏవో షేక్ టిప్పు సుల్తాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాధురి మాట్లాడుతూ రైతులందరికీ యూరియా పంపిణీ విషయంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

గ్రంథాలయంలో అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ గ్రంథాలయంలో 58వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం వేడుకలు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ నాంపల్లి అప్పారావు సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలవేసి, అక్షరాస్యత దినోత్సవం గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రిటైర్డ్ హెడ్మాస్టర్, రాష్ట్ర బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత కె రాజగోపాల్ రావు, రిటైర్డ్ వెటర్నరీ ఆఫీసర్ ఆత్కూరు ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఆరుద్ర కొండ, వై శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి రామచంద్రుడు పాల్గొన్నారు.

ఇబ్బందికర ఫ్లెక్సీలపై చర్యలు : ఎస్‌పి



మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సమాజానికి ఇబ్బంది కలిగించే విధమైన ఫ్లెక్సీలు ప్రింట్ చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు హెచ్చరించారు. ఎస్పీ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ హాలులో ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నిచోట్ల వివాదాస్పద వ్యాఖ్యలతో కూడిన ఇబ్బందికర ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వలన తలెత్తిన వివాదాలు, గొడవలు గమనించడం జరిగిందని కాబట్టి ఏ మతాన్ని గాని, కులాన్ని గాని, ప్రాంతాన్ని గాని, ఒక వర్గాన్ని గాని, వ్యక్తులను గాని కించపరిచే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీలు తయారు చేయవద్దని సూచించారు.ఒకవేళ మీ వద్దకు వచ్చి ఎవరైనా వ్యక్తిగత దూషణలు, విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీలను ప్రింట్ చేయమని అడిగితే వెంటనే నిరాకరించాలన్నారు.ఆ విధమైన వ్యాఖ్యలతో కూడిన ప్రింట్ చేసిన ఫ్లెక్సీల వల్ల ఏవైనా అల్లర్లు, సంఘర్షణలు, సామాజిక అవస్థలు చోటుచేసుకుంటే పూర్తిగా బాధ్యత ఫ్లెక్సీ ప్రింటర్స్ నిర్వాహకులపై ఉంటుందని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని తెలిపారు. అలాగే ఫ్లెక్సీలు ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి యొక్క పూర్తి సమాచారం అనగా వారి చిరునామా, ఇతర వివరాలు అన్నిటిని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ప్రతి ఫ్లెక్సీ ప్రింటింగ్ ఆఫీసు నందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రింట్ చేసిన ఫ్లెక్సీ నందు ప్రింటింగ్ సంస్థ యొక్క లోగో తప్పనిసరిగా ముద్రించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి. నాయుడు , స్పెషల్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఇన్స్పెక్టర్ వి. వెంకటేశ్వరరావు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వంట షెడ్డు నిరుపయోగం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద నిర్మించిన వంట షెడ్డు అలంకార ప్రాయంగా ఉంది. ఈ షెడ్డుకు మన బడి మన భవిష్యత్తు కింద ప్రస్తుత సర్కార్ నిధులు కేటాయించక పోవటంతో ఈ వంట షెడ్డుకు పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు పూర్తవ్వక అరకొరగా ఉంది. దీనితో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి చేసే వంటను ఆరుబయటే నిర్వహిస్తున్న దుస్థితి ఏర్పడింది. ఈ షెడ్డుకు నిధులు కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యూరియా సరఫరా

ప్రజాశక్తి-కంకిపాడు: మండల పరిధిలోని ఉప్పులూరు, పునాదిపాడు, మంతెన, కోలవెన్ను, తెన్నేరు, పొద్దుటూరు, నెప్పల్లి సొసైటీలకు 15 టన్నులు చొప్పున, గొడవర్రు, మద్దూరు పది టన్నుల చొప్పున యూరియా రావడం జరిగిందని కంకిపాడు మండల వ్యవసాయ అధికారిని ఉషారాణి తెలిపారు. ప్రొద్దుటూరు, పునాదిపాడు గ్రామంలో డిస్ట్రిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ ఎన్.పద్మావతి యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డిఎస్పి బంగార్రాజు తెన్నేరు, ఉప్పులూరు గ్రామాల్లో యూరియా పంపిణీని పరిశీలించారు.

యూరియా పంపిణీపై అవగాహన

ప్రజాశక్తి-గుడివాడ: మండలంలో రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులోకి వస్తుందని రైతులు ఈ విషయంలో ఎటువంటి సందేహాలు లేకుండా వ్యవసాయం చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారిణి అనంతలక్ష్మి అన్నారు. బుధవారం గుడివాడ రూరల్ మండలంలోని చిరిచింతలలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 696 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మన గ్రోమోర్ సెంటర్ ద్వారా కూడా ప్రత్యేకంగా 53 మెట్రిక్ టన్నులు గుడివాడ మండలంలోని గ్రామాలకు పంపిణీ చేయడం జరిగిందని, యూరియా ఎప్పుడూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఈ సదస్సులో రైతులు తదితరులు పాల్గొన్నారు.



22 నుంచి తాళం భజన, మురళీ కోలాటం పోటీలు



ప్రజాశక్తి-ఘంటసాల: దేవీ నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పులో ఈనెల 22 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు మూడు జిల్లాల పరిధిలో తాళం భజన, మురళీ కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పొడుగు ప్రభాకర్, పువ్వుల శ్రీనివాస్ ,కే నాగేశ్వరరావు, గుత్తికొండ వరప్రసాద రావు పేర్కొన్నారు. దానికి సంబంధించిన కరపత్రాలను వారు చిట్టూర్పులో గంగ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తాళం భజన, మురళీ కోలాటం పోటీలను ఈ నెల 22 వ తేదీ ఉదయం 8 గంటలకు చిట్టూర్పు శివాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 18వ తేదీ లోపు పోటీల్లో పాల్గొనేవారు దరఖాస్తులు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 9247443763, 8179322189 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఓర్వలేకనే తప్పుడు ప్రచారం : టిడిపి

ప్రజాశక్తి-గుడివాడ : ఓర్వలేని తనంతోనే వైసిపి తప్పుడు ప్రచారాలు చేస్తుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజావేదికలో మార్కెట్ యార్డు చైర్మన్లు, పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు విలేకర్లుతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు పిఎసిఎస్‌ల ఆధ్వర్యంలో రైతు భరోసా, గ్రోమోర్ కేంద్రాల ద్వారా పారదర్శకంగా యూరియా బస్తాలు అందిస్తుంటే ఓర్వలేని వైసిపి నాయకులు రైతులు లేకుండా పోరుబాట పేరుతో మోసం చేస్తున్నారన్నారు. గుడివాడలో రైతుల అవసరాలకు అనుగుణంగా 2,946 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. ఈ సమావేశంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, గుడివాడ, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవికుమార్, గుడివాడ, నందివాడ టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, దానేటి సన్యాసిరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన దాడుల్లో సుమారు 10,57,500 రూపాయల జరిమానా విధించినట్లు విద్యుత్ శాఖ ఉన్నతాధికారి సి.హెచ్.వాసు తెలిపారు. మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవిందరావు ఆధ్వర్యంలో అధికారులు 34 బృందాలుగా ఏర్పడి 2794 గృహ సర్వీసులు, 131 వాణిజ్య సర్వీసులు, 228 ఆక్వా సర్వీసులు తనిఖీ చేశారు. వాటిలో 310 సర్వీసులకు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఎడిఇ కె.రామకృష్ణ, రూరల్ ఎఇ పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-పామర్రు: మండల పరిధి నిభానుపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు. జిల్లా పరిషత్ నిధులు 13 లక్షల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేస్తుందని కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని అశోక్ కుమార్ అన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-పామర్రు: గ్రామ సీమలు దేశ ప్రగతికి పట్టుకొమ్మలని వాటి అభివృద్ధి ద్వారా దేశాభివృద్ధి చెందుతుందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పామర్రు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు, కార్యదర్శులకు, ఎంపీటీసీలకు గ్రామ అభివృద్ధి పై పిపిఐ 2.0 (పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్) సమీక్ష సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో కే జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాసరి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పిపిఐ 2.0 ప్రోగ్రాం ద్వారా గ్రామానికి ఆదాయ వనరుల సమీకరణ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చిన, రాబోవు నిధులతో గ్రామంలో కావలసిన త్రాగునీరు, పారిశుధ్యం, వైద్య సహాయం తదితర మౌలిక వసతుల కల్పనకు, సుస్థిర అభివృద్ధికి, కేటాయించాల్సిన ప్రణాళికపై ట్రైనీ అయిన ఉరుటూరు, నిభానుపూడి కార్యదర్శులు చందు,అమర్నాధులు ప్రతినిధులకు వివరించారు. ఈ విధానం ద్వారా దేశంలో ఎక్కడి నుండైనా ఆయా గ్రామ పంచాయతీల స్థితిగతులను ప్రభుత్వాలు తెలుసుకోవడానికి కావలసిన నిధులు కేటాయించడానికి వీలవుతుందన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ప్రజాశక్తి-మోపిదేవి: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని పలువురు ప్రముఖులు తెలిపారు. గురుపూజోత్సవం కార్యక్రమం పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తుంగల చంద్రశేఖర్, జిల్లా స్థాయిలో రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్చే ప్రశంసాపత్రం పొందిన పి.జయంతి, ఏడాది కాలంలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు, రావి నాగేశ్వరరావు, నడకుదుటి జనార్ధనరావు తదితరులు దుస్సాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో విద్యాప్రమాణాలు పెంచుతూ, జిల్లా, రాష్ట్రస్థాయిలో మోపిదేవి ఖ్యాతిని ఇనుమడింపచేసిన ఉపాధ్యాయులు ఆదర్శ ప్రాయులని తెలిపారు. రానున్న కాలంలో విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దాలని వారు ఆకాంక్షించారు. మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీరాణి, వైస్ ఎంపీపీ నడకుదుటి జనని కుమారి, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంతటివోలు ఏ.వి.రమణ, జిఎస్పి గోపాల్, ఇంచార్జ్ ఎంపిడివో పాండురంగారావు తదితరులు ఉన్నారు.

ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-గుడివాడ : సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు శివ నాగేంద్రం మాట్లాడుతూ మతోన్మాదంతో రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాడిన ఏచూరి లేనిలోటు తీర్చలేనిదన్నారు. ఎల్ఐసి నాయకులు ఓ.ధనుంజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పలు ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్, సాహితీ స్రవంతి అధ్యక్షులు సురేంద్ర, యలమర్తి కోటేశ్వరరావు, అవిర్నేని వెంకటేశ్వరరావు, వి.కృష్ణకిషోర్, పి.రజని, సాంబశివరావు, సుబ్బారావు, లక్ష్మణరావు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ సత్యనారాయణ జయంతి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ యావత్ భారతదేశానికి సాహిత్య వారసత్వ సంపద అని కెబిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు అన్నారు. సంస్కార భారతి ఆంధ్రప్రదేశ్ శాఖ, కెబిఎన్ కళాశాల తెలుగు విభాగం సంయుక్త నిర్వహణలో బుధవారం విశ్వనాథ 130వ జయంతి వేడుకలు కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వనాధుని సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యటం ద్వారా యువతరంలో మానవీయ విలువలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ, దుర్గా శ్రీనివాస్, గూటాల రామకుమార్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా షేక్ అబ్బాస్ అలీ, కార్యదర్శిగా కొత్తపల్లి కోటేశ్వరరావు, కోశాధికారిగా కర్లపాటి కొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద గల సంఘ కార్యాలయంలో పరిశీలకుడు విష్ణువర్ధన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ చేసిన వైద్యాధికారి అనిల్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. సంఘం సభ్యులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

తిరువూరులో భారీ వర్షం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరులో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో తిరువూరు బస్టాండ్ జలమయమైంది. ప్లాట్ ఫామ్ అంతా చిన్నపాటి చెరువును తలపించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెయిన్ రోడ్డుపైకి వర్షపునీరు భారీగా చేరింది. చంద్రమౌళీశ్వర దేవాలయం సెంటర్, బైపాస్ రోడ్డు హీరో షోరూం ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించింది. అయితే, గత నాలుగు రోజులుగా తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం ఇచ్చింది.

నలుగురికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరులోని శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో నలుగురు విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్వోక్వెస్ట్ బ్యాక్‌గ్రౌండ్ చెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌ను కళాశాలలో బుధవారం నిర్వహించింది. డిగ్రీ, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతిభ కనబరిచి నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఏవో కిషోర్ బాబు, ఎంబిఎ విభాగాధిపతి పాపారావు, ప్లేస్‌మెంట్ అధికా రులు షరీఫ్, ప్రసాద్, కంపెనీ హెచ్‌ఆర్ టీమ్ అభినందించారు.

చెత్త సేకరించే వారికి గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-తిరువూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నమస్తే కార్యక్రమం కింద పట్టణాల్లో, వీధుల వెంట చెత్త కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలు సేకరించే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి రూ.ఐదు లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ మనోజ్ తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసి స్టమ్ పథకంపై పారిశుధ్య కార్మికులకు, చెత్త సేక రణ చేసే వారికి బుధవారం కార్యాలయం ఆవరణలో అవాహన కల్పించారు.

క్రీడల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

- కలెక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదం చేస్తాయని, సాంస్కృతిక, సామాజిక అంతరాలను తొలగించేందుకు ఉపయోగపడతాయని, రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర స్పోర్ట్స్ విజన్‌కు అనుగుణంగా సమష్టి కృషితో ఎన్‌టిఆర్ జిల్లాను క్రీడల్లో నెంబర్ వన్‌గా నిలబెడదామని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో శక్తివంతమైన క్రీడా ఆవరణ వ్యవస్థను సృష్టించేందుకు, ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో, అత్యాధునిక శిక్షణతో క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు, క్రీడా నైపుణ్యం, కొత్త ఆవిష్కరణల్లో ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపుతోందన్నారు. ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా క్రీడలు, ఖేలో ఇండియా వంటి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించే మన క్రీడాకారులకు భారీ నజరానాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వనరులను సద్వినియోగం చేసుకొని క్రీడాకారులు జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఎ అజీజ్, వివిధ క్రీడల కోచ్‌లు పి.రవికుమార్, కె.భాస్కర్, కె.జగదీష్, ఎస్.సంతోష్ కుమార్, ఎస్‌కె రియాజ్, ఎస్‌కె ముంతాజ్ బేగం, కె.స్వామి, కె.చిరంజీవి, నాగేశ్వరరావు, డిఎస్ఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ

- ప్రజాశక్తి వార్తకు వ్యవసాయశాఖ జెడి వివరణ

ప్రజాశక్తి-నందివాడ

నందివాడ మండలం జనార్ధనపురం పిఎసిఎస్ వద్ద టోకెన్లు ఇచ్చి క్రమపద్ధతిలో రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్ పద్మావతి తెలిపారు. ప్రజాశక్తి ఎన్‌టిఆర్, కృష్ణా టాబ్లాయిడ్ ఐదో పేజీలో బుధవారం నందివాడ డేట్‌లైన్‌లో ప్రచురించిన 'యూరియా కోసం రైతుల పాట్లు' వార్తకు ఆమె వివరణ ఇచ్చారు. నందివాడ తహశీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్‌ల సహకారంతో అక్కడ యూరియా పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. ఈ పిఎసిఎస్ పరిధిలో 800 ఎకరాల వ్యవసాయ భూములకు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు ఎకరాకు 90 కిలోల చొప్పున అవసరమైన 72 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా ఎవరైనా రైతులకు యూరియా అవసరమైతే అందించడం జరుగుతుందని వివరించారు. జనార్ధనపురంలో నివసిస్తున్న కొందరు రైతులకు పెదపారుపూడి మండలం పాములపాడులోనూ వ్యవసాయ భూములున్నాయని, అక్కడ భూములున్న రైతులు పాములపాడు పిఎసిఎస్‌లో యూరియా తీసుకోవాలని సూచించారు.



కొణతమాత్మకూరు పిఎసిఎస్ చైర్మన్‌గా చెరుకూరి

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ మండలం కొణతమాత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షునిగా చెరుకూరి సాంబశివరావు ఎన్నికయ్యారు. బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొని నూతన అధ్యక్షుడిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నందిగామ మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, మాజీ ఎంపిపి మన్నె కళావతి, కొణతమాత్మకూరు టిడిపి నాయకులు భాస్కరరావు, తొర్రగుడిపాడు సర్పంచ్ చెరుకూరి హైమారావు పాల్గొన్నారు.

గోల్డ్ స్పాన్సర్‌గా హైయర్ ఇండియా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నంబర్ వన్ హోమ్ అప్లయన్సెస్ బ్రాండ్‌గా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న సంస్థ హైయర్ ఇండియా ప్రతిష్టాత్మక ఆసియా కప్ 2025లో గోల్డ్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోందని హైయర్ అప్లయెన్సెస్ అధ్యక్షుడు ఎన్ఎస్ సతీష్ తెలిపారు. నగరంలోని సంస్థ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. క్రికెట్ అత్యంత ప్రసిద్ధ క్రీడ కావడంతో ఈ భాగస్వామ్యం స్పోర్ట్స్ ఓ టైన్‌మెంట్ మార్కెటింగ్ పట్ల హైయర్ యొక్క దీర్ఘకాలిక నిబద్ధతను బలోపేతం చేస్తుందన్నారు. దీనిద్వారా ప్రీమియం, యువ, క్రీడా అవగాహన ఉన్న వినియోగదారులతో సంబంధాన్ని మరింతగా పెంచుకోవడానికి కీలకమైన వ్యూహంలో భాగంగా భావించవచ్చు అన్నారు.

దోమ తెరలతో ఐద్వా వినూత్న నిరసన

ప్రజాశక్తి-విజయవాడ



నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

విజయవాడ నగరంలో దోమల నివారణలో నగరపాలక సంస్థ ఘోరంగా విఫలమయిందని, ఇప్పటికైనా వాటిని నిర్మూలించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి జి రూన్సీరాణి, నగర కోశాధికారి ఎస్ కె దేవి కుమారి అన్నారు. దోమల నిర్మూలనలో ఘోరంగా విఎంసి విఫలమైన దానికి నిరసనగా సింగ్‌నగర్ 58వ డివిజన్ శివాలయం ఏరియాలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు దోమ తెరలతో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రూన్సీరాణి, దేవికుమారి మాట్లాడుతూ...దోమల వలన నగర వాసులు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. శానిటేషన్ మెరుగుదలకు, దోమల నిర్మూలనకు విఎంసి పాలకవర్గం, అధికారులు, నగరంలోని ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. గతేడాది వచ్చిన బుడమేరు వరదలకు సింగ్ నగర్ పాయకాపురం ప్రాంతమంతా కాలవల్లో వ్యర్థాలు, మట్టి కూరుకుపోయి, మురుగు ఏర్పడి దోమలకు నిలయంగా మారిందన్నారు. సింగ్‌నగర్, పాయికాపురం ప్రాంతాలలో సాయంత్రం ఆరు గంటల నుండి తెల్లారే వరకు దోమలు బెడద తప్పడం లేదని అన్నారు. దోమల కాటు వలన పలు రకాల వ్యాధుల బారినపడుతున్నారని, దోమల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎస్ విజయలక్ష్మి , పెద్ద మణి, చిన్న మణి, కాశింబీ, సుజిత, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



వేగ జ్యుయలరీ వార్షిక నివేదిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నగరంలోని వేగ జ్యుయలరీ వార్షిక నివేదికను సంస్థ బ్రాండ్ అంబాసిడర్ హీరో బాల కృష్ణ ఆవిష్కరించారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వనమా నవీన్ తెలిపారు. నగరంలోని వేగ జ్యుయలరీ నందు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 వార్షిక నివేదికను తయారుచేసినట్లు తెలిపారు. అలాగే సంస్థ రానున్న పండుగలు దసరా, దీపావళి, వివాహాది ,శుభకార్యాలు సందర్భంగా ప్రత్యేక మైన కలెక్షన్స్ అందుబాటులోకి తీసుకుంటున్నామని తెలిపారు. పండుగలు సందర్భంగా తమ సంస్థకు సంబంధించి అన్ని షోరూంలో అందించే ఆఫర్లు కూడా వినియోగ దారులకు తెలియజేస్తున్నామన్నారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించండి

- విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, నగరంలోని రోడ్లన్నిటిలోనూ గుంతలను పూడ్చాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఏఎస్ రామారావు రోడ్, క్రీస్తురాజు పురం, లొయోల కాలేజ్ రోడ్, పంట కాలవరోడ్, పటమట ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కంపాక్టర్ బిన్ లోని వ్యర్ధాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, నగరంలోని రోడ్లన్నిటిలోనూ గుంతలు పూడ్చాలని, ఎప్పటికప్పుడు గుంతలు లేని నగరంగా విజయవాడ ను ఉంచాలని, అభివృద్ధి కార్యక్రమాలైనా, మరమ్మతులైన చేపట్టినప్పుడు ఖచ్చితంగా బ్యారిగేట్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, బ్యారిగేట్లు లేనిదే పనులు చేపట్ట రాదని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారుల్లోని డివైడర్ల వద్ద సక్రమంగా పారిశుధ్య నిర్వహణ జరిపించాలని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అధికారులను ఆదేశించారు. పటమట లోని అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతుల్ని కల్పించాలని, వసతుల్లో ఎటువంటి మరమ్మతులు లేకుండా చూసుకోవాలని, ఆహారంలో నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యర్థాలను పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

నలుగురికి జైలు

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు మండలం మునకుళ్ళ గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని పగల గొట్టి కేసులో నలుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ తిరువూరు జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పుచెప్పారు. ఎస్ఐ సత్య నారాయణ తెలిపిన వివరాల ప్రకారం 2024 ఏప్రిల్ 20న వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని పగలగొట్టి రూ.10 వేలు నగదును చోరీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వెదురు రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మణికల వసంతరావు, పొన్నూరు రాంబాబు, మణికల నరేష్, మణికల సురేష్‌లను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఓ.అనూష తీర్పు వెలువరించారు. మణికల వసంతరావుకు 17 నెలలు, పొన్నూరు రాంబాబు, మణికల నరేష్, మణికల సురేష్‌లకు 9 నెలలు కఠిన శిక్ష విధించారు.

పూల డిజైన్‌తో శాంసంగ్ సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, సరసమైన, స్టైలిష్ రిఫ్రిజిరేటర్ల కోసం చూస్తున్న భారతీయ గృహాల అవసరాలను తీర్చడానికి రూపొందించిన తన తాజా 183 లీటర్ల సామర్థ్యం గల సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్ శ్రేణిని ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ ఇంచార్జి కె.ప్రతాప్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు పూల నమూనాలు, బెగోనియా, వైల్డ్ లిలీలలో ఎనిమిది కొత్త మోడళ్లతో, ఈ కొత్త సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్లు ఎరుపు, నీలం రంగుల్లో లభిస్తుందన్నారు. సౌందర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన ఈ కొత్త సింగిల్ డోర్ శ్రేణి, ఆధునిక భారతీయ గృహాల కోసం ప్రత్యేకంగా తయారు చేయబడిందని తెలిపారు.

మార్కెట్‌లోకి ఏషియన్ పెయింట్స్ 'రాయల్ గ్లిట్జ్'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నాణ్యతకు మారుపేరు ఏషియన్ పెయింట్స్ ఇప్పుడు ఏషియన్ పెయింట్స్ తన లగ్జరీ బ్రాండ్ 'రాయల్ గ్లిట్జ్'ను ప్రీమియం వాల్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ సింఘాల్ తెలిపారు. నగరంలోని ఓ హెటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. 'ఇల్లు స్థిరమైన నిర్మాణం కాదని, వ్యక్తిత్వానికి అనుగుణంగా మారుతూ ఉండే ప్రతిబింబమని పేర్కొన్నారు. మదువైన క్రీమ్ ఫినిష్, టెఫ్లాన్ సర్ఫేస్ ప్రొటెక్టర్, ప్రముఖ డిజైనర్లతో ప్రత్యేకంగా రూపొందించిన కలర్ రేంజ్‌తో రాయల్ గ్లిట్జ్ కేవలం అందం మాత్రమే కాకుండా అత్యుత్తమ పనితీరును కూడా అందిస్తుందన్నారు. రంగులు, ఫినిష్‌లు, డెకోర్ విభాగాల్లో కస్టమర్ల ప్రయాణాన్ని విలువైనదిగా మార్చడమే ఏషియన్ పెయింట్స్ లక్ష్యమన్నారు.